జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## నల్లగొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

శుక్రవారం 8 మే 2026 పేజీలు : 14







2 లో..

### కాంగ్రెస్ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరిక

# రాష్ట్రవ్యాప్తంగా 'హైడ్రా' కావాలని ప్రజలు కోరుతున్నారు



ఇప్పటికే కబ్జాలపై వేలాదిగా ఫిర్యాదులు అందాయి

ప్రక్షాళన జరిగిన భూముల విలువ సుమారు 85 వేల కోట్లు

– హైడ్రా కమిషనర్ ఎ వి రంగనాథ్

**మిర్యాలగూడ, మే 07,( ప్రజాజ్యోతి ):**

కబ్జాల చెరలో ఉన్న భూములను ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రా రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ చేయాలని ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తు తున్నాయని హైడ్రా కమిషనర్ ఆవుల వెంకట రంగనాథ్ తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక ఎన్ఎస్పి గెస్ట్ హౌస్ లో విలేకరులతో మాట్లాడుతూ కబ్జాలపై హైడ్రాకు వేలాదిగా ఫిర్యాదులు వచ్చాయని, వాటి పరిష్కార దిశగా దృష్టి పెట్టామన్నారు.నాలుగు వారాలపాటు ప్రజావాణిని రద్దు చేశామని,ఇప్పుడున్న దరఖాస్తులను పరిష్కరించడమే ముందు ప్రాధాన్యతగా చేస్తున్నామన్నారు.హైడ్రాకు వ్యతిరేకంగా కొందరు కోర్టును ఆశ్రయిస్తున్నారని,మేము కూడా చట్టపరంగా ఎదుర్కొంటామని తెలిపారు.హైడ్రాకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు.కబ్జా విషయంలో హైడ్రా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నారన్నారు.కబ్జా కోరల నుండి 2,100 భూములను హైడ్రా స్వాధీనం చేసుకుందని వీటిలో చెరువులు ,ప్రభుత్వ భూములు, పార్కులు రోడ్లు ఉన్నాయన్నారు. వీటి విలువ సుమారు 85 వేల కోట్ల రూపాయలు ఉంటుంద న్నారు.మరో సంవత్సర కాలంలో లక్ష కోట్లు విలువ చేసే భూములను హైడ్రా కాపాడుతుందని తెలిపారు.హైడ్రా పరిధిలోనే 10 లక్షల కోట్ల విలువ చేసే భూములు కబ్జాకు గురైనట్లు సమాచారముం దన్నారు.భవిష్యత్ తరాల కోసం హైడ్రా ఆధ్వర్యంలో చెరువుల పునర్ధరణ కొనసాగుతుం దన్నారు. హైడ్రా రాష్ట్రవ్యాప్త విస్తరణ ప్రభుత్వ నిర్ణయమ న్నారు.

2 లో..

2 లో..




### చేర్మెన్‌గా తిరిగి బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వేణుధర్ రెడ్డి



2

### తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం

## వడ్ల కుప్పల చెంతే

# అన్నదాతల ఆవేదన!

2 లో..






### మిర్యాలగూడ ఆర్డీవో గా బాధ్యతలు స్వీకరించిన ఎస్ రమణారెడ్డి

మిర్యాలగూడ రెవెన్యూ డివిజనల్ అధికారిగా ఎస్. రమణారెడ్డి గురువారం మధ్యాహ్నం బాధ్యతలుస్వీకరించారు. పాలనా సౌలభ్యం కోసం మిర్యాలగూడను సబ్ కలెక్టర్ స్థాయికి ప్రమోట్ చేస్తూ ప్రభుత్వం గతంలో నిర్ణయం తీసుకోవడంతో సబ్ కలెక్టర్ గా ఐ ఎ ఎస్ నారాయణ్ అమిత్ సబ్ కలెక్టర్ గా విధులు నిర్వహించారు.

# వడ్ల కుప్పల చెంతే అన్నదాతల ఆవేదన!

## – కొనుగోలు కేంద్రాల్లో అస్తవ్యస్తం.. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం
## – తేమ పరీక్షలు దాటినా సాగని తూకం.. మిల్లర్ల కోతలతో రైతులకు దెబ్బ

**చౌటుప్పల్, మే 7 ( ప్రజా జ్యోతి):**

ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం కారణంగా రైతులు నానా అవస్థలు పడుతున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఆరోపించారు. బుధవారం చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన ఆయన రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారాల తరబడి వడ్ల కుప్పలు మార్కెట్ యార్డుల్లోనే ఉండిపోతుండగా, 44 డిగ్రీల ఎండలో రైతులు పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల గుండెలు ఆగిపోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హైదరాబాద్‌లో కూర్చొని రైతులకు ఇబ్బందులు లేవని చెప్పడం సరికాదన్నారు. క్షేత్రస్థాయికి వచ్చి



రైతుల సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. మాయిశ్చర్ పరీక్షలకు రోజులు పడుతుండగా, సంచుల పంపిణీ, కాంటా ప్రక్రియలోనూ తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ధాన్యం మిల్లులకు వెళ్లిన తర్వాత ‘తాలు’ పేరుతో కోతలు పెడుతున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు హయాంలో రైతుబంధు, ఉచిత విద్యుత్, ఎరువుల సరఫరా సకాలంలో జరిగేవని గుర్తుచేశారు. ప్రస్తుతం యూరియా కొరత, కరెంట్ సమస్యలు, రైతుబంధు ఆలస్యంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పాల్వాయి స్రవంతి, పల్లె రవికుమార్, సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి, నిరంజన్‌గౌడ్, సుర్కంటి శ్రీనివాస్‌గౌడ్‌రెడ్డి, పాక రాము, కొండ విజయ్, ఏచూరి నరసింహ, వడ్డెపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరిక

## సొంత గూటికి చేరిన ఏరుకొండ నరేష్

మర్రిగూడ,మే 07(ప్రజాజ్యోతి ):మునుగోడునియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ మాజీ సభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా ఇందుర్తి గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబెర్ ఏరుకొండ నరేష్ కాంగ్రేస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలోకి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ దంటు జగన్,మాజీ ఎంపీటీసీ ఊరుపక్క సరిత నగేష్, ఏరుకొండ అబ్బయ్య,అనంతల వెంకటేష్ గౌడ్ ,బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సిలివేరు రమేష్,ఏరుకొండ లింగస్వామి, లపంగి బిక్షం, వార్డు మెంబర్ లపంగి సాయి,మాడ్గుల సాయి, బొల్లోజు శేఖర్, మొహమ్మద్ హుస్సేన్,లపంగి శివ,ఊరుపక్క ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

# చేర్మెన్ గా తిరిగి బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వేణుధర్ రెడ్డి

**మల్లేపల్లి, మే 07 (ప్రజాజ్యోతి):**

మల్లేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు సంఘ డైరెక్టర్లు కూడా తమ పదవులను చేపట్టారు. గత రెండు నెలల క్రితం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాలను ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయంపై పాలకవర్గాలు హైకోర్టును ఆశ్రయించగా, పాత కార్యవర్గాలను యథావిధిగా కొనసాగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు మల్లేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాత పాలకవర్గం తిరిగి బాధ్యతలు చేపట్టింది. అనంతరం చైర్మన్ డా. దూదిపాల వేణుధర్ రెడ్డి మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సకాలంలో కాంటాలు వేసి, కేటాయించిన రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ తిరుపతి రెడ్డి, దేవరకొండ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్దిశెట్టి సుధాకర్, కార్యాలయ సిబ్బంది, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం

**--డాక్టర్ బూర నర్సయ్య గౌడ్**

**హుజూర్ నగర్, మే 07 (ప్రజా జ్యోతి):**

తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. గురువారం హుజూర్ నగర్ పట్టణంలో బిజెపి పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ప్రధాని నరేంద్ర మోడీ హాజరుకానున్నారని తెలిపారు. ప్రధానమంత్రిగా మూడోసారి బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా తెలంగాణ గడ్డపై అడుగుపెడుతున్న నేపథ్యంలో ఈ సభ చారిత్రాత్మకంగా నిలవనుందని పేర్కొన్నారు. అలాగే వేల కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలకు వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం వేగంగా అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని అన్నారు. ఈ చారిత్రాత్మక సభను విజయవంతం చేయడానికి హుజూర్‌నగర్ నియోజకవర్గంతో పాటు సూర్యాపేట జిల్లా నలుమూలల నుంచి యువత, మహిళలు, రైతులు, మేధావులు, కార్మికులు, వ్యాపారవేత్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి ఘన స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ విజయపథంలో దూసుకుపోతుందని అస్సాం, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి వంటి ప్రాంతాల్లో ప్రజలు బీజేపీకి భారీ మద్దతు తెలుపుతున్నారని పేర్కొన్నారు.

# మిర్యాలగూడ ఆర్డీవో గా బాధ్యతలు స్వీకరించిన ఎస్ రమణారెడ్డి

**మిర్యాలగూడ,మే07,( ప్రజాజ్యోతి ):**

మిర్యాలగూడ రెవెన్యూ డివిజనల్ అధికారిగా ఎస్. రమణారెడ్డి గురువారం మధ్యాహ్నం బాధ్యతలుస్వీకరించారు. పాలనా సౌలభ్యం కోసం మిర్యాలగూడను సబ్ కలెక్టర్ స్థాయికి ప్రమోట్ చేస్తూ ప్రభుత్వం గతంలో నిర్ణయం తీసుకోవడంతో సబ్ కలెక్టర్ గా ఐ ఎ ఎస్ నారాయణ్ అమిత్ సబ్ కలెక్టర్ గా విధులు నిర్వహించారు. ఇటీవల ఆయన జిహెచ్ఎంసి శేరి లింగంపల్లి జోనల్ కమిషనర్ గా బదిలీ కాగా దేవరకొండ డిప్యూటీ కలెక్టర్ గా పనిచేస్తున్న ఎస్ రమణారెడ్డి బదిలీపై మిర్యాలగూడ ఆర్డీవో గా వచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసిల్దార్ చాంద్ పాషా, జూనియర్ అసిస్టెంట్ జమాల్, అబ్బాస్, ఉమేరా, అఫ్రోజ్, కార్యాలయ సిబ్బంది మొక్కను అందజేసి ఆయనకు స్వాగతం పలికారు. మిర్యాలగూడ తహసిల్దార్ శ్రీనివాస్ నూతన ఆర్టీవోను శాలువాతో సన్మానించి తాహాసిల్దార్ కార్యాలయ సిబ్బందిని పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ ప్రవీణ్ కుమార్, ఆర్ ఐ రామకృష్ణ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.




# అసిస్టెంట్ కమాండెంట్‌గా బి.రాజు పదవి బాధ్యతలు

**– ఘనంగా స్వాగతం పలికిన ఇన్స్పెక్టర్లు,సిబ్బంది**

**సచివాలయం నుండి సాగర్ డ్యామ్ భద్రతకు**

**– విజయ భాస్కర్ రావు హైకోర్టు కు బదిలీ**

**నాగార్జునసాగర్, మే 7ప్రజా జ్యోతి**

తెలంగాణ రాష్ట్ర స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ నాగార్జునసాగర్ యూనిట్ అసిస్టెంట్ కమాండెంట్‌గా బి.రాజు గురువారం పదవి బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ అసిస్టెంట్ కమాండెంట్‌గా విధులు నిర్వహించిన విజయ భాస్కర్ రావు బదిలీపై తెలంగాణ రాష్ట్ర హైకోర్టుకు వెళ్లడంతో,ఆయన స్థానంలో బి.రాజు నియమితులయ్యారు. గతంలో తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన బి.రాజు,అసిస్టెంట్ కమాండెంట్‌గా పదోన్నతి పొంది నాగార్జునసాగర్ యూనిట్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సాగర్ డ్యామ్ మరియు జెన్‌కో విభాగాల భద్రతా బాధ్యతలను ఆయన పర్యవేక్షించ నున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అసిస్టెంట్ కమాండెంట్ రాజుకు నాగార్జునసాగర్ జెన్‌కో,సాగర్ డ్యామ్ ఎస్పీఎఫ్ ఇన్స్పెక్టర్లు ప్రతాప్ నాయుడు, శ్రీనివాస్ రావు,ఎస్ఐ లు రఘుబాబు, వెంకటేశ్వర్లు,ఏఎస్ఐలు పుల్లయ్య, మహమ్మద్,ఇతర సిబ్బందితో కలిసి ఘనంగా పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ సాగర్ ప్రాజెక్టు భద్రత విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉంటామని పేర్కొన్నారు.



# ఈనెల 9న కంఠమహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన





**తుంగతుర్తి, మే 7,(ప్రజా జ్యోతి):**

మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన కంఠమహేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 9 న విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఉంటుందని గౌడ భక్తులు తెలిపారు. గురువారం గ్రామంలో విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం జలాధివాసం నిర్వహించారు. 8 వ తేదీన మంగళ హారతులు ,జల బిందెల తో ర్యాలీ, ఆలయం వద్ద హోమాలు, పంచామృతాభిషేకం ,జలాభిషేకశీ,దీపోత్సవ కార్యక్రమం, కుంకుమ పూజ నిర్వహించబడుతుంది. ఈనెల 9 న స్వామివారి కళ్యాణం, ఈనెల 10 న బలి పూజ కార్యక్రమం ఉంటుంది.దాతల సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికీ గ్రామ సర్పంచ్ మేడ్డుల రమేష్ రూ.10 వేల రూపాయల విలువ గలిగిన విద్యుత్ లైట్లను బహుకరించారు. అలాగే పాండవుల విజయేందర్ రూ.5 వేల రూపాయలు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో గౌడ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా వీఆర్ కాలేజ్ ప్రిన్సిపాల్ అయ్యప్ప జన్మదిన వేడుకలు

**ఆలేరు మే 7 ప్రజా జ్యోతి**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రానికి చెందిన వెంకటరమణ జూనియర్ కాలేజ్ అధినేత ప్రముఖ విద్యావేత్త భవిష్యత్ తరాలకు ఆణిముత్యాలు అయిన విద్యార్థులకు మార్గదర్శకులై అన్నిట్య విద్యార్థుల భవిష్య రూపకర్తలుగా శ్రమిస్తూ క్రమశిక్షణకు మారు పేరు తెచ్చుకున్న నాళం అయ్యప్ప జన్మదిన వేడుకలను కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు కమలాకర్ , తదితరులు పాల్గొన్నారు



# శ్రమశక్తి అవార్డు గ్రహీత నాదెళ్ల బాలకృష్ణకు చిరు సత్కారం

**కోదాడ టౌన్,మే07 (ప్రజా జ్యోతి):**

కోదాడ అంబేద్కర్ ఆశయ సాధన కేంద్రం (ఆస్క్), కోదాడ ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్, టీజీ ఆర్జెసి కోచింగ్ సెంటర్ లో శ్రమశక్తి అవార్డు గ్రహీత నాదెళ్ల బాలకృష్ణ కి ఘన సన్మాన కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెస్ కళాశాలలో గురువారం ఆస్క్ అధ్యక్షురాలు బల్గూరి స్నేహ దుర్గయ్య అధ్యక్షతన జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య, విశ్రాంత ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు బొల్లు రాంబాబు లు పాల్గొని సన్మాన గ్రహీతను సత్కరించడం జరిగింది.ఈ సందర్భంగా రావెల సీతారామయ్య మాట్లాడుతూ సత్యమేవ జయతే సేవాసమితి ద్వారా సమాజ సేవా కార్యక్రమాలు చేపడుతూ, విద్యుత్ శాఖలో రైతులకు, పేద ప్రజల పక్షాన నిరంతరం శ్రమ చేస్తున్న నాదెళ్ల బాలకృష్ణకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మేడే సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేత శ్రమశక్తి అవార్డు పొందడం ఎంతో



ఆనందించదగిన విషయమని అన్నారు. విద్యార్థినీ విద్యార్థులు బాలకృష్ణని ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో మాతంగి ప్రభాకర్ రావు, బొడ్డు హుస్సేన్, అమరబోయిన వెంకటరత్నం, గంధం బుచ్చారావు, కనుకు శ్రీకాంత్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు..

# బొల్లు ప్రసాదును పార్టీ నుండి తొలగించాలంటూ ఏకగ్రీవ తీర్మానం

## సిపిఐ కార్యకలాపాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాడని ఆరోపణ

## జిల్లా సిపిఐ నాయకులకు త్వరలోనే తీర్మాన లేఖను అందజేస్తాం

**కోదాడ టౌన్, మే 07 (ప్రజా జ్యోతి):**

కోదాడ మున్సిపల్పరిధిలోని స్థానిక తమ్మరబండ పాలెం గ్రామం లో కమ్యూనిస్టు పార్టీ కార్య కలాపాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాడని సిపిఐ తమ్మర గ్రామ శాఖ నాయకులు కార్యకర్తలు తెలిపారు గురువారం గ్రామంలోని స్థానిక బత్తినేని శ్రీనివాసరావు నివాస గృహములో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు ఈ సమావేశంలో బోల్లు ప్రసాద్ ను సస్పెండ్ చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు గతంలో కోదాడ మండల సిపిఐ కార్యదర్శిగా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులుగా పనిచేస్తున్న గ్రామానికి చెందిన బొల్లు ప్రసాదును సస్పెండ్ చేయాలంటూ సిపిఐ మ్మర గ్రామ శాఖ తీర్మానం ప్రవేశపెట్టగా నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించా ప్రసాదు గ్రామంలో ఉన్న సిపిఐ పార్టీ కార్యకర్తలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాడని ఆరోపించారు అలాగే పార్టీ పేరుతో తాను ఇష్టాను రాజ్యంగా చందాలు వసూలు చేశాడని గత ఎన్నికల్లో పార్టీని ఓడించేందుకు వ్యతిరేకంగా పనిచేసే చేశాడని ఆరోపణలతో గ్రామ శాఖ పార్టీ ఏకగ్రీవంగా ఆమోదించారు ఇలాంటివారును పార్టీ నుండి రక్షించేందుకు సస్పెండ్ చేయాలని కోరారు తీర్మాన పత్రాన్ని గ్రామ శాఖ పార్టీ మండల పార్టీకి అందజేశారుత్వరలో మండల పార్టీ నుండి జిల్లా నాయకులు కలిసి



అందజేస్తామని తెలిపారు తమ్మర బండ పాలెం గ్రామ శాఖ కార్యదర్శి మాతంగి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అల్వాల పురం గ్రామ సర్పంచ్ పోతురాజు సత్యనారాయణ, సిపిఐ కోదాడ మండల కార్యదర్శి బత్తినేని హనుమంతరావు రెండో వార్డ్ కౌన్సిలర్ రాయపూడి కాటమరాజు కొండా కోటేశ్వరరావు నిడిగొండ రామకృష్ణ బత్తినేని శ్రీనివాసరావు మల్లారెడ్డి గూడెం బాబు మేస్త్రి నిడికొండ శ్రీనివాసరావు అల్వాల గురవయ్య బొమ్మ కంటి రాంబాబు లక్ష్మీనర్స్, అల్వాల శ్రీను నిడిగొండ రాంబాబు పస్తం లింగయ్య , ఎల్లయ్య శ్రీను సద్దాం మధ్యాహ్నపు శ్రీను సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

# హై కోర్టు ఉత్తర్వులతో తిరిగి సహకార సంఘం బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గం

**మిర్యాలగూడ, మే 07,( ప్రజాజ్యోతి ):**

హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం మిర్యాలగూడ మండలం తడకమళ్ళ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గా పాదురు సంజీవరెడ్డి తోపాటు పాలకవర్గం వైస్ చైర్మన్ వీరేపల్లి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గాలు గత రెండు నెలల క్రితం రద్దుకాగా పాలకవర్గాలు దీనిపై కోర్టును ఆశ్రయించాయి .కాగా హైకోర్టు పాత కార్య వర్గాలని యధావిధిగా కొనసాగించాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు తడకమళ్ళ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాత పాలకవర్గం బాధ్యతలు చేపట్టింది. డైరెక్టర్లు జిల్లా నాగయ్య, బొమ్మకంటి సత్యం, వొలిశెట్టి భాస్కర్, గుండు కోటయ్య, కొండెబోయిన శ్రీనివాస్, మన్నెం కొండల్ రెడ్డి, వస్కుల సూర్యం, మచ్చ సీతారాములమ్మ, పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్మన్ పాదురు సంజీవరెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కాంటాలు వేసి, కేటాయించిన మిల్లులకు ఎగుమతిచేసి రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సేవే లక్ష్యంగా కేఎంపి హెల్పింగ్ హాండ్స్
## దాత ఎండి లతీఫ్‌కు సన్మానం

**కొండమల్లేపల్లి, మే 7(ప్రజాజ్యోతి):**

వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న వేళ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కేఎంపి హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ చేస్తున్న సేవలు అభినందనీయమని కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి పేర్కొన్నారు.కేఎంపి హెల్పింగ్ హాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో ప్రతిరోజు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తూ కార్మికులు, ప్రయాణికులు, ప్రజలకు ఉపశమనం కలిగించడం గొప్ప విషయమన్నారు.గురువారం చలివేంద్రానికి పెరుగు అందజేసిన భారత్ బైక్ బజార్ యజమాని ఎండి లతీఫ్ ను సర్పంచ్ ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, సేవా దృక్పథంతో పనిచేస్తున్న కేఎంపి హెల్పింగ్ హాండ్స్ సొసైటీ మునుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.సమాజ సేవలో ముందుండే సంస్థకు తాను ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేయడమే గొప్ప విషయం కాగా, దాతల సహకారంతో ప్రతిరోజు ఉచితంగా మజ్జిగ పంపిణీ



చేయడం మరింత అభినందనీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కేఎంపి హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులు ఏరుకొండ రాము, కూన భానుచందర్, విప్పలపల్లి జితేందర్ యాదవ్, దండు రవికుమార్, సురేందర్ రెడ్డి, బొడ్డుపల్లి మల్లికార్జున్, పి సైదులు, మాధవ్, శ్రీను నాయక్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి -

**నిడమానూరు తహశీల్దార్ కృష్ణయ్య**

**-వేంపాడు సబ్ సెంటర్ ను అకస్మిక తనీఖీ చేసిన**

నిడమానూరు ,మే07(ప్రజాజ్యోతి):వేంపాడు సబ్ సెంటర్ ను నిడమానూరు గురువారం తహశీల్దార్ జంగాల కృష్ణయ్య అకస్మిక తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు మండలంలోని అన్ని సబ్ సెంటర్ల్ లో కూడా వైద్యసేవలు మెరుగు పరచాలని ఏఎన్ఎంకు ,ఆశావర్కర్లు కు తహశీల్దార్ జంగాల కృష్ణయ్య సూచించారు. వేంపాడు సబ్ సెంటర్ ను అకస్మిక తనిఖీ చేసి అనంతరం ఆయన మాట్లాడుతూ రోగులకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయో లేదో చూసుకోవాలని



సూచించారు.అదేవిధంగా వేసవి కాలంలో రోగులకు ,ప్రజలకు అధిక మొత్తంలో మందులతో పాటు ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని తహశీల్దార్ జంగాల కృష్ణయ్య పేర్కొన్నారు. మండలంలోని సబ్ సెంటర్లులో ప్రతి రోజూ ఏఎన్ఎం, ఆశా వర్కర్లు అందుబాటులో ఉండేలే చూడాలన్నారు.అదేవిధంగా సబ్ సెంటర్ లో ఐదుగురు ఆశావర్కర్లు ఉండగా రోజువారీ చోప్పున ఒక ఆశావర్కర్ ,సబ్ సెంటర్ లో వైద్య సేవలు అందించేందుకు హాజరైతే రోగులకు అన్ని రకాల మందులను పంపిణీ చేయడానికి సులువుగా ఉంటుందని తహశీల్దార్ పేర్కొన్నారు.కార్యక్రమంలో ఏఎన్ఎం డి.యునికే,సబ్ సెంటర్ ఆశావర్కర్లు బారెడ్డి అనుషారెడ్డి,మంగమ్మ,పద్మ, లింగమ్మ,ఎల్లమ్మ,తదితరులు,పాల్గొన్నారు.

# రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం : మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్

**కొండమల్లేపల్లి, మే 7, (ప్రజాజ్యోతి):**

వడ్ల కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రమావత్ రవీంద్ర కుమార్ విమర్శించారు. గురువారం కొండమల్లేపల్లి మండలం పెండిపాకుల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే పరిస్థితి లేక రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని అన్నారు. అప్పులు తెచ్చి పంట పండించిన రైతులకు ఇప్పుడు ధాన్యం అమ్ముకునే దారి లేకపోయిందని పేర్కొన్నారు. “ములుగే నక్కపై తాటిపండు పడ్డట్టు రైతుల పరిస్థితి మారింది” అని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేకపోతుందని, గన్నీ బ్యాగులు సరఫరా చేసే స్థితిలో కూడా లేదని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు హయాంలో వడ్ల కొనుగోళ్లలో ఇంత ఆలస్యం ఎప్పుడూ జరగలేదని గుర్తు చేశారు.ప్రభుత్వం తరుగు పేరిట రెండు కిలోల వడ్లు కట్ చేస్తోందని, మిల్లర్లు మరో మూడు కిలోలు తగ్గిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఈ అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. అధికారులు కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు.ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటోందని ఆరోపించిన ఆయన, పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదవి నుంచి దిగిపోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ పర్యటనలతో ప్రజలకు ఉపయోగం ఏమిటని ప్రశ్నించారు.దేవరకొండ ఎమ్మెల్యే సోషల్ మీడియాకే పరిమితమయ్యారని విమర్శిస్తూ, రైతుల సమస్యలను పట్టించుకొని కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని కోరారు. మిల్లర్ల వద్ద మంత్రులు, ఎమ్మెల్యేలు కమిషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన 7 గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ పిఏసిఎస్ చైర్మన్ పల్ల ప్రవీణ్, టీవీన్ రెడ్డి,దశ్రు నాయక్, చెన్నారం సర్పంచ్ తుల్సిరామ్ నాయక్ చింతకుంట్ల సర్పంచ్ వెంకటేష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మా డబ్బులు తీసుకుని.. బార్ వేరేవారికి ఇచ్చారు

## బార్ అండ్ రెస్టారెంట్ ముందు బాధితుల ధర్నా

## కోదాడలో ఎక్సైజ్ వ్యవహారం కలకలం

## ఒరిజినల్ చలాన్లు తమ దగ్గరే ఉన్నాయని బాధితుల ఆరోపణ

**కోదాడ టౌన్ ,మే 07 ( ప్రజా జ్యోతి):**

కోదాడ పట్టణంలో బార్ లైసెన్స్ వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసింది. లక్షల రూపాయలు చెల్లించినప్పటికీ బార్ లైసెన్స్ తమకు ఇవ్వకుండా వేరే వారికి కట్టబెట్టారంటూ బాధితులు బార్ అండ్ రెస్టారెంట్ ముందు ధర్నాకు దిగడం సంచలనంగా మారింది. ఈ ఘటనతో కోదాడలో ఎక్సైజ్ శాఖ పనితీరుపై తీవ్ర చర్చ జరుగుతోంది.గురువారం పట్టణంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ ఎదుట శాఖమూరి కేశవరావు, మిర్యాల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేపట్టారు. “మేమే ప్రభుత్వ బకాయిలు చెల్లించాం... ఒరిజినల్ చలాన్లు కూడా మా దగ్గరే ఉన్నాయి... అయినా లైసెన్స్ వేరేవారికి ఎలా ఇచ్చారు?” అంటూ బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆందోళనతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ధర్నా చేస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. కొంతసేపు బార్ పరిసరాల్లో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

**రూ.85 లక్షల ఒప్పందం... రూ.42 లక్షల చెల్లింపు**

బాధితుల వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లా మునగాల మండలం మాధవరం గ్రామానికి చెందిన నల్లగొండ అనిత పేరిట ఉన్న “శ్రీ చెన్నకేశవ బార్ అండ్ రెస్టారెంట్” కొనుగోలు కోసం ఈ ఏడాది జనవరిలో రూ.85 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు.

అనంతరం ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిల కోసం మార్చి నెలలో ఎస్‌బీఐ చలానాల ద్వారా రూ.42 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. ఆ చెల్లింపులకు సంబంధించిన ఒరిజినల్ చలాన్లు ఇప్పటికీ తమ వద్దే ఉన్నాయని వెల్లడించారు.

**అదే చోట కొత్త బార్‌కు అనుమతులు**

తమ పేరుపై లైసెన్స్ బదిలీ అవుతుందని భావిస్తున్న సమయంలో అదే ప్రదేశంలో “న్యూ సాయి స్వగత్ బార్ అండ్ రెస్టారెంట్” పేరుతో కొత్తవారికి అనుమతులు రావడం అనుమానాలకు తావిస్తోందని బాధితులు ఆరోపిస్తున్నారు. “ఒరిజినల్ చలాన్లు లేకుండా అధికారులు ఎలా లైసెన్స్ ఇచ్చారు? ఇందులో ఎవరి ఒత్తిళ్లు పనిచేశాయి?” అంటూ ఎక్సైజ్ శాఖపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

**కమిషనర్‌కు ఫిర్యాదు**

ఈ వ్యవహారంపై ఇప్పటికే హైదరాబాద్‌లోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. తమకు న్యాయం చేయాలని, లైసెన్స్ బదిలీ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.ఈ ఘటన ప్రస్తుతం కోదాడ రాజకీయ, వ్యాపార వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఎక్సైజ్ శాఖ ఈ ఆరోపణలపై ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.



# చిత్రలేఖనంలో ప్రతిభ చాటిన చిన్నారులు



కోదాడ టౌన్, మే 07 ( ప్రజా జ్యోతి):

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు కళలు, క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎస్ఆర్ఎం విద్యాసంస్థల చైర్మన్ కేశినేని శ్రీదేవి అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం, రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు డ్రాయింగ్, కవిత పఠన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఠాగూర్ వంటి మహనీయుల స్ఫూర్తితో విద్యార్థులు విజ్ఞానంతో పాటు కళారంగంలోనూ రాణించాలని కోరారు. చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు ఆరోగ్యం, క్రీడాస్ఫూర్తి, ప్రకృతి సంరక్షణ వంటి అంశాలను కళ్లకు కట్టినట్లు చిత్రించి ఆకట్టుకున్నారు. కవితా పఠనంలో తమ భావ వ్యక్తీకరణతో ప్రతిభను చాటారు. ఉత్సాహంగా సాగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో రైతుల దోపిడీపై సీపీఎం ఆందోళన

నకిరేకల్ ప్రజా జ్యోతి

నకిరేకల్ మండలంలోని ఓగోడు, చందుపట్ల శాఖల ఆధ్వర్యంలో మేడే వారోత్సవాల సందర్భంగా గ్రామాల్లో మేడే జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కందాల ప్రమీల, మండల కార్యదర్శి రాచకొండ వెంకట్ గౌడ్ మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి నెల రోజులు దాటినా కొనుగోళ్లు మందకొడిగా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లర్లు తాలు పేరుతో అధిక కటింగ్ చేస్తున్నారని, లారీ యజమానులు 40 కిలోల బస్తాకు రూ.5 నుంచి రూ.6 వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా బస్తాకు రెండు కిలోలు, క్వింటాకు 5 నుంచి 6 కిలోల వరకు తరుగు పేరుతో రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. అధికారులు సమస్యలను పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకుని రైతుల ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓగోడు గ్రామ శాఖ కార్యదర్శి అక్కెనపల్లి సైదులు, చిట్టిపాక విజయేందర్, చందుపట్ల శాఖ కార్యదర్శి షాబాద్ బిక్షం రెడ్డి, మండల కమిటీ సభ్యుడు జిల్లా ఉపేందర్, శ్రీరాములు, అంజయ్య, పాచకొండ వెంకటయ్య, హర్ష, బద్రి తదితరులు పాల్గొన్నారు.



# మండల కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుల మార్పుపై వేగంగా చర్చలు

## యువతకు అవకాశాల దిశగా పార్టీ ఆలోచన



మునగాల మే 07 (ప్రజాజ్యోతి):

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో మండల అధ్యక్షుల మార్పు అంశం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ విషయంపై విస్తృతంగా చర్చలు జరిగినట్లు పార్టీ వర్గాల్లో సమాచారం వినిపిస్తోంది. పార్టీ బలోపేతం, గ్రామ స్థాయి నుంచి సంస్థాగత పునర్వ్యవస్థీకరణ లక్ష్యంగా ఈ నిర్ణయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గతంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులను ఎలాగైతేఎన్నికల ద్వారా ఎంపిక చేసిన విధానాన్ని మాదిరిగా తీసుకుని, మండల అధ్యక్షుల ఎంపికలో కూడా అదే విధానం అమలు చేయాలనే ఆలోచన పార్టీ నాయకత్వంలో ఉందని ప్రచారం జరుగుతోంది. సుమారు మూడు సంవత్సరాలుగా పదవిలో కొనసాగుతున్న మండల అధ్యక్షులను మార్పు చేసి, పార్టీ కోసం కష్టపడుతున్న యువ నాయకులకు అవకాశం ఇవ్వాలని నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. గ్రామాలు, మండల స్థాయిలో పార్టీ కార్యకలాపాలను మరింత చురుకుగా మార్చడం, కొత్త ఉత్సాహాన్ని తీసుకురావడం, యువతను ప్రోత్సహించడం ఈ చర్య వెనుక ప్రధాన ఉద్దేశ్యాలుగా కనిపిస్తున్నాయి. అలాగే పార్టీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పనితీరు, ప్రజలతో అనుసంధానం, పార్టీ కార్యక్రమాల్లో చురుకుదనం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని మార్పులు చేపట్టే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో స్థానిక సమీకరణాలు, సామాజిక సమతౌల్యం, వర్గాల ప్రాతినిధ్యం వంటి అంశాలు కూడా కీలకంగా ఉండే అవకాశముంది. ఈ మార్పులపై ఇప్పటికే అంతర్గతంగా చర్చలు జరుగుతున్నప్పటికీ, అధికారికంగా పార్టీ నుంచి ప్రకటన ఇంకా వెలువడలేదు. అయితే రాబోయే రోజుల్లో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని, త్వరలోనే మార్పుల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో మండల స్థాయి నాయకత్వంలో మార్పులు చోటుచేసుకుంటే, పార్టీ కార్యకలాపాల్లో కొత్త ఉత్సాహం, పోటీ వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# ఎస్సీ కార్పొరేషన్ దరఖాస్తుదారులకు మౌఖిక ఇంటర్వ్యూలు

నకిరేకల్ ప్రజా జ్యోతి

ఈరోజు నకిరేకల్ మండల పరిధిలో ఎస్సీ కార్పొరేషన్ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మౌఖిక ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలం మొత్తం మీద 184 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 152 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీ కిరణ్‌తో పాటు వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థుల వివరాలను పరిశీలించారు. పథకాల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.



# నియోజకవర్గ ప్రజల సుభిక్షం కోసం గ్రామ దేవతలను ప్రార్థించిన ఎమ్మెల్యే

చందంపేట,మే 7, (ప్రజా జ్యోతి):

చందంపేట మండలం కంబాలపల్లి గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించి దేవరకొండ నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ గ్రామ దేవతల ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలు మన సంస్కృతికి ప్రతీకలని పేర్కొన్నారు. గ్రామాల్లో ఐక్యత, శాంతి, సుభిక్షం నెలకొనేలా ప్రతి ఒక్కరూ కలిసి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రైతులు పంటలతో అభివృద్ధి చెందాలని, యువత మంచి భవిష్యత్తు సాధించాలని గ్రామ దేవతలను ప్రార్థించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే రాకతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గ్రామ ప్రజలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొని భక్తులతో కలిసి ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# అమాత్యా....మా గోడు వినండి !





## జాతీయ రహదారి మళ్లించండి...
## ట్రాఫిక్ ఇక్కట్లు తొలగించండి..!!
### మంత్రులు, కలెక్టర్ కు ఎమ్మెల్యే బిఎల్ఆర్ వినతి

**మిర్యాలగూడ, మే 07,( ప్రజాజ్యోతి ):**







మిర్యాలగూడ పట్టణ వాసుల ప్రధాన సమస్యగా మారిన ట్రాఫిక్ రద్దీపై స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బి ఎల్ ఆర్) గళమెత్తారు. పట్టణం గుండా వెళ్తున్న జాతీయ రహదారిని బైపాస్ కు మళ్లించి ప్రజలకు ఉపశమనం కలిగించాలని కోరుతూ గురువారం మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్‌లకు ఆయన వినతిపత్రాన్ని అందజేశారు.? గత ప్రభుత్వ హయాంలో మిర్యాలగూడ టౌన్ రోడ్డును జాతీయ రహదారిగా ప్రకటించి నప్పుడు,శాస్త్రీయంగా జరగాల్సిన 100 ఫీట్ల విస్తరణను కాదని, కేవలం 84 ఫీట్లకే పరిమితం చేయడం ఇప్పుడు శాపంగా మారిందని ఎమ్మెల్యే వివరించారు. దీనివల్ల రోడ్డు వెడల్పు సరిపోక వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని ఆయన పేర్కొన్నారు.వ్యాపార కేంద్రంగా ఉన్న మిర్యాలగూడలో ప్రతిరోజూ సుమారు 50,000 మందికి పైగా ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. స్థానిక వాహనాలతో పాటు, భారీ లోడ్లతో వెళ్లే జాతీయ రహదారి వాహనాలు కూడా పట్టణం మధ్య నుండే వెళ్లడం వలన గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయన్నారు. వ్యాపారసముదాయాలు, నివాసాల మధ్య భారీ వాహనాల వల్ల ప్రమాదాల ముప్పు పొంచి ఉందని తెలిపారు.పాదచారులు, పాఠశాల విద్యార్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డు దాటాల్సిన పరిస్థితి నెలకొందన్నారు .పట్టణ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, జాతీయ రహదారిని పట్టణం వెలుపలి నుండి మళ్లించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వారిని కోరారు. ప్రస్తుత రోడ్డును కేవలం స్థానిక అవసరాలకే పరిమితం చేయాలని ఆయన మంత్రులను కోరారు.దీనిపై మంత్రులు సానుకూలంగాస్పందిస్తూ, సంబంధిత అధికారులతో చర్చించి తదుపరిచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల కలలకు కొత్త వెలుగు : ఎమ్మెల్యే బాలు నాయక్





**దేవరకొండ, మే 07,(ప్రజాజ్యోతి):**

దేవరకొండ మండలంలోని అంబటోనిగూడెం గ్రామానికి చెందిన దామరాశెట్టి రాధ ఆల్వాల్ గారు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటి యాజమానికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాధ ఆల్వాల్ కుటుంబం నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రతి ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందే వరకు తమ కృషి నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ప్రజా పాలనలో పేదల సంక్షేమమే మా మొదటి ప్రాధాన్యత అని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అరుణ సురేష్ గౌడ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్, గ్రామ సర్పంచ్ జ్యోతి పాండు నాయక్, ఎంపీడీఓ దానియల్, హౌసింగ్ ఏఈ ఎల్లయ్య, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, మాజీ ఎంపీటీసీ సీత్య నాయక్, పంచాయతీ కార్యదర్శి సరిత, మాజీ సర్పంచ్ అంజయ్య, జంగయ్య, డిప్యూటీ సర్పంచ్ సోమ్లా, వెంకటయ్య, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జహంగీర్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

**ఆత్మకూరు ఎం మే 7 (ప్రజా జ్యోతి)**

ఆత్మకూర్ ఎం మండల కేంద్రానికి చెందిన వార్త విలేఖరి పొన్నగాని జహంగీర్ గౌడ్ మాతృమూర్తి అయిన పొన్న గాని చంద్రకళ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధైర్యంగా ఉండి కుటుంబ సభ్యులను మంచిగా చూసుకోవాలని ఓదార్చారు .ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రైతు సమన్వయ మండల అధ్యక్షుడు యాస ఇంద్రారెడ్డి, బిఆర్ఎస్ జిల్లా నాయకుడు కోరే బిక్షపతి, యాస రంగారెడ్డి, బిజెపి మండల కార్యదర్శి నాగం సత్తిరెడ్డి, ఏనుగు కరుణాకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల పాత్ర కీలకం

**హాలియా,మే7(ప్రజా జ్యోతి)**

గ్రామాలలో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల పాత్ర కీలకమని హాలియా ఎస్ఐ సాయి ప్రశాంత్ అన్నారు.గురువారం మండలంలోని మారేపల్లి గ్రామంలో సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండాలని అనుమానస్పద వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.సీసీ కెమెరాలతో అనుమానస్పద వ్యక్తుల కదలికలను గుర్తించి నేరాలను అరికట్టవచ్చని,నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.గ్రామ భద్రత కోసం స్థానిక ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు, పోలీస్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు



# ధోతిగూడెం దేవాలయ చైర్మన్గా పగిళ్ల సుధాకర్ రెడ్డి ఎన్నిక

**భూదాన్ పోచంపల్లి, మే 07 (ప్రజాజ్యోతి)**



మండలంలోని ధోతిగూడెం గ్రామ శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం నూతన కమిటీని గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పగిళ్ల సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బాలం మల్లయ్య, కార్యదర్శిగా ప్రసాదం విష్ణు, సహాయ కార్యదర్శిగా ముద్దం సత్తయ్య, కోశాధికారిగా ముద్దం సత్యం ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ గుర్రం యాదిరెడ్డి, సర్పంచ్ యాట జంగయ్య, ఉపసర్పంచ్ బద్దం వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు

# "చలో పరేడ్ గ్రౌండ్" బిజెపి సన్నాహక సమావేశం



**భూదాన్ పోచంపల్లి, మే 07 (ప్రజాజ్యోతి)**

పట్టణ కేంద్రంలో ఈ నెల 10న నరేంద్ర మోదీ హైదరాబాద్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ "చలో పరేడ్ గ్రౌండ్" సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు గూడూరు నరోత్తం రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రధాని సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డబ్బికార్ సాహెష్ కుమార్, మాధురి, చిక్క కృష్ణ, గంజి బసవలింగం, ఏలే శ్రీనివాస్, అంజయ్య యాదవ్, చెరుకు రాము గౌడ్, సీతా మణికంఠ, సీత మానస, చెరుకు నికితా, రుద్ర చక్రపాణి పంతులు పాల్గొన్నారు.

# బాధితుని ఆర్థిక సహాయం

**నూతనకల్... మే 08 (ప్రజా జ్యోతి):**

మండల పరిధిలోని పెదనెమిల గ్రామానికి చెందిన చిత్తలూరి రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబానికి మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నల్లెడ తిరుమల్ రెడ్డి గురువారం 5000 రూపాయలను ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు గుగులోతు బాలాజీ నాయక్, నల్లెడ నరేష్ రెడ్డి, కుటుంబ సభ్యులు చిత్తలూరి ఉమేష్ గౌడ్, సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# దేవరకొండ'కు కేబినెట్ యోగం దక్కేన?

## వెనుకబడిన దేవరకొండకు దక్కనున్న ప్రాధాన్యం

## సామాజిక సమీకరణాలపై అధిష్టానం కసరత్తు..

## గిరిజన గుండెల్లో ఆశల పల్లకి..

## బాలునాయక్‌కు మంత్రి పదవి?





**దేవరకొండ, మే 07, (ప్రజాజ్యోతి):**

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం దగ్గర పడుతున్న తరుణంలో, ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ గారి పేరు రాష్ట్ర రాజకీయాల్లో ప్రముఖంగా వినిపిస్తోంది. సామాజిక న్యాయం, ప్రాంతీయ సమతుల్యత మరియు సీనియారిటీ ప్రాతిపదికన ఆయనకు కేబినెట్ లో చోటు దక్కడం దాదాపు ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**లంబాడా సామాజికవర్గానికి ప్రాతినిధ్యం:**



ప్రస్తుత రాష్ట్ర మంత్రివర్గంలో వివిధ సామాజికవర్గాలకు ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ, లంబాడా వర్గం నుండి ఎవరూ మంత్రులుగా లేకపోవడం ప్రధాన లోటుగా కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజన ఓటు బ్యాంకును కాపాడుకోవాలన్నా, ఆ సామాజికవర్గానికి భరోసా కల్పించాలన్నా బాలునాయక్ వంటి విధేయుడైన సీనియర్ నేతకు అవకాశం కల్పించడం అనివార్యమని అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం.

**?వెనుకబడిన ప్రాంత అభివృద్ధికి ఊతం:**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో అత్యంత వెనుకబడిన మరియు కొండప్రాంతాలు కలిగిన దేవరకొండ నియోజకవర్గానికి ఇప్పటివరకు సరైన రాజకీయ గుర్తింపు లభించలేదనే అసంతృప్తి స్థానిక ప్రజల్లో ఉంది. బాలునాయక్ గారు మంత్రి పదవిని చేపడితే, ఈ ప్రాంతంలోని సాగునీటి ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల కల్పన మరియు నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని స్థానిక నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**?రాజకీయ వ్యూహం మరియు జానారెడ్డి మద్దతు:**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా మంత్రి పదవి ఆశిస్తున్నప్పటికీ, ఇప్పటికే జిల్లా నుండి ఇద్దరు రెడ్డి సామాజికవర్గ నేతలు (మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి మరియు కోమటిరెడ్డి వెంకటరెడ్డి) ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ తరుణంలో సామాజిక న్యాయం పాటించాలంటే బాలునాయక్ గారే సరైన ఎంపిక అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యోచిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు, కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి గారి పూర్తి మద్దతు బాలునాయక్ కు ఉండటం ఆయనకు కలిసొచ్చే అంశం. నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, పార్టీ పట్ల విధేయతతో పనిచేస్తున్న బాలునాయక్ గారికి మంత్రి పదవి దక్కడం వల్ల ఉమ్మడి నల్గొండ జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. త్వరలోనే వెలువడనున్న అధికారిక ప్రకటన కోసం దేవరకొండ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# సాగర్ రోడ్డు పైడివైడర్లను తొలగించకుంటే ప్రత్యక్ష కార్యాచరణ - మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

## ప్రజలకు అసౌకర్యంగానున్న డివైడర్లను తొలగించాలి అఖిలపక్షం ఏకగ్రీవ తీర్మానం

**మిర్యాలగూడ,మే07,( ప్రజాజ్యోతి ):**

వాణిజ్య కేంద్రమైన మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్డుపై ప్రజలకు అసౌకర్యంగా నిర్మించిన డివైడర్లను తొలగించకుంటే ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోవాలని దానికి తానే ముందుంటానని మాజీ ఎమ్మెల్యే, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పేర్కొన్న స్థలాల వద్ద అడ్డంగా ఉన్న డివైడర్ను తొలగిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో హైవే ఏర్పాటు వల్ల డివైడర్లు ఏర్పాటు చేయవలసి వచ్చిందని అయినా ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న ఐదు ప్రాంతాలలో వాటిని తొలగించే విధంగా ఎమ్మెల్యేగా మాట్లాడి వాటిని తొలగించేందుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. లేనిపక్షంలో తానే ముందుగా గడ్డపారతో తొలగించేందుకు అఖిలపక్షంతో సహకరిస్తానన్నారు. డివైడర్లను తొలగించాలి ముక్తకంఠంగా తీర్మానించిన అఖిలపక్షం సాగర్ రోడ్డుపై ప్రజలకు అసౌకర్యంగా నిర్మితమైన డివైడర్లను తొలగించాలని గురువారం జరిగిన అఖిలపక్ష సమావేశం ముక్తకంఠంగా తీర్మానించింది. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డి.మల్లేష్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశం జరిగింది.



వైష్ణవి హోటల్ లో సాగర్ రోడ్డుపై నిర్మితమైన డివైడర్లను తొలగించేందుకు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ అధ్యక్షతన అఖిలపక్షం సమావేశంలో రంగారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిని తాము అడ్డుకోమని ఆ పేరుతో ప్రజలకు అసౌకర్యంగా ఉన్న వాటిని తొలగించాలని తాము కోరుతున్నట్లు తెలిపారు. మిర్యాలగూడ పట్టణానికి సమీప ప్రాంతాల నుండి వేలాలాదిమంది వ్యాపార, తదితర పనులకు ప్రజలు వస్తుంటారని నేపథ్యంలో రోడ్డు దాటడానికి అడ్డంగా ఇటీవల నిర్మించిన డివైడర్లు ఆటంకంగా ఉన్నాయని వారు అన్నారు. పట్టణం నుండి జాతీయ రహదారి వెళ్లడం సాకుతో డివైడర్లను ఏర్పాటు చేశామనడం సమంజసం కాదన్నారు. సమస్య తీవ్రంగా ఉన్నందువల్ల ప్రజాప్రతినిధులు ఎంపీ, ఎమ్మెల్యే చొరవ తీసుకుని పరిష్కారం చేయాలని కోరారు. ముఖ్యంగా ఫర్టిలైజర్ బజార్ కు వెళ్లే మార్గంలోని డివైడర్ను అదేవిధంగా నందిపాడు రోడ్డు, గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డు, సాయిబాబా దేవాలయానికి వెళ్లే రోడ్డు, పోలీస్ స్టేషన్ కు వెళ్లే రోడ్డులకు అడ్డం గా ఉన్న డివైడర్లను తొలగించాలని వారు కోరారు. లేనియెడల తామే గుణపంతో పై సమావేశంలో కాంగ్రెస్ తో సహా మిగిలిన అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు. వారందరూ డివైడర్లను పట్టణంలో ఐదు ప్రాంతాలలో తొలగించాలన్నారు. ముఖ్యంగా సాగర్ రోడ్డుపై గల నాలుగు ప్రాంతాల్లోని డివైడర్లను తొలగించాలని ప్రజల పక్ష నాయకులు కోరారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు అవసరమే అయినా పనులు చేయాలి తప్ప ప్రజలకు ఇబ్బంది కలిగించే పనులు చేయొద్దని ప్రజా సొమ్ము దుర్వినియోగం చేయొద్దని అఖిలపక్ష నాయకులు కోరారు. సమావేశంలో సిపిఎం నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు మల్లు గౌతంరెడ్డి, భావండ్ల పాండు సీపీఐ నాయకులు బంటు వెంకటేశ్వర్లు, బిఆర్ఎస్ కౌన్సిలర్ ఇలియాస్, బిజెపి నాయకులు చిలుకూరు శ్యాం, ఐఎంఎ నాయకులు డాక్టర్ మువ్వా రామారావు డాక్టర్ జె.రాజు, డాక్టర్ మల్సూర్, ఏంసిపిఐయు నాయకులు వస్కుల మట్టయ్య, ఎంఐఎం నాయకులు సయ్యద్ ఫారూఖ్, టాప్రా నాయకులు నూకల జగదీష్చంద్ర ఐద్వా నాయకులు అరుణ, సామాజిక కార్యకర్తలు కస్తూరి ప్రభాకర్, ప్రముఖ వ్యాపారవేత్తలు నీలా మోహన్ రావు, పాండురంగయ్య, జవహర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



# అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీ



**కోదాడ రూరల్, మే 07 (ప్రజాజ్యోతి):**

సూర్యాపేట జిల్లా పరిధిలోని అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తూ, అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం కదులుతోంది. ఇందులో భాగంగా, తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రధాన వారధిగా ఉన్న జాతీయ రహదారి 65పై, కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామాపురం వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ను జిల్లా ఎస్పీ నరసింహ గురువారం ఆకస్మికంగా సందర్శించారు.ఎస్పీ స్వయంగా చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ రిజిస్టర్లను పరిశీలించి, వాహనాల రాకపోకల సరళిని అడిగి తెలుసుకున్నారు. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ఈ కీలక మార్గంలో ఎక్కడా అలసత్వం వహించకుండా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం ఎస్పీ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ,"ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సాగే అక్రమ కార్యకలాపాలను అరికట్టడంలో ఈ చెక్‌పోస్ట్ కీలక పాత్ర పోషిస్తోంది. ప్రధానంగా ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యం, ఇసుక, మద్యం, పశువుల రవాణా మరియు ఇతర నిషేధిత వస్తువుల స్మగ్లింగ్‌ను అడ్డుకోవడానికి ఇక్కడ పోలీసు, రెవెన్యూ మరియు ఇతర శాఖల సమన్వయంతో 24 గంటల నిఘా ఏర్పాటు చేశాం," అని పేర్కొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి:

ప్రస్తుత సాగు సీజన్ దృష్ట్యా, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నుండి వరి ధాన్యం తెలంగాణలోకి అక్రమంగా రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. "స్థానిక రైతుల ప్రయోజనాలను కాపాడటం మా బాధ్యత. బయటి రాష్ట్రాల ధాన్యాన్ని ఇక్కడ విక్రయించడానికి ప్రయత్నిస్తే వాహనాలను సీజ్ చేయడమే కాకుండా, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం," అని ఆయన హెచ్చరించారు.తనిఖీల పేరుతో సామాన్య ప్రజలకు, అత్యవసర వాహనాలకు అంబులెన్స్ వంటివి మరియు సాధారణ ప్రయాణికులకు ఎలాంటి ఆటంకాలు లేదా అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని క్షేత్రస్థాయి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ఆరోగ్యం మరియు భద్రత పట్ల కూడా శ్రద్ధ వహించాలని, రాత్రి వేళల్లో తగిన వెలుతురు మరియు ట్రాఫిక్ కోన్ల వంటి భద్రతా పరికరాలను తప్పనిసరిగా వాడాలని సూచించారు.జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, సరిహద్దుల గుండా అక్రమంగా ఏదైనా తరలిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలని ఆయన కోరారు.?ఈ తనిఖీ కార్యక్రమంలో ఎస్పీ వెంట కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, అనంతగిరి ఎస్సై నవీన్, ట్రాఫిక్ ఎస్సై అంజిరెడ్డి, ఐటి కోర్ సిబ్బంది మరియు చెక్‌పోస్ట్ వద్ద విధుల్లో ఉన్న పోలీస్ బలగాలు పాల్గొన్నారు.




# మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఏసీబీ విస్తృత సోదాలు

**మిర్యాలగూడ, మే07,( ప్రజాజ్యోతి ):**

నల్గొండ జిల్లా మిర్యాలగూడ మున్సిపాలిటీపై గురువారం ఏసీబీ అధికారులు అకస్మాత్తుగా తనిఖీలు చేపట్టారు. ఏసీబీ డి ఎస్ పి జగదీష్ చంద్ర నేతృత్వంలో ఇద్దరు సిఐలు, ముగ్గురు ఎస్ఐలులతో కలిసి సుమారు 20 మంది సిబ్బంది ఉదయం ఒక్కసారిగా కార్యాలయంలోకి వచ్చి సిబ్బంది నుండి సెల్ ఫోన్లు, ఫైల్స్ ను







తీసుకొని మున్సిపల్ కార్యాలయ గేటుకు తాళాలు వేసి రికార్డులను పరిశీలించారు . ఏసీబీ అధికారుల రాకతో మిర్యాలగూడ మున్సిపాలిటీ ఒక్కసారిగా హులిక్కిపడింది. ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో పలు అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని,పలు పనులు చేయకుండానే నిధులు డ్రా చేసినట్లుగా ఆరోపణలు ప్రచారం జరిగాయి. ఈ నేపథ్యంలోనే ఏసీబీ అధికారులు సోదాలు చేపడుతున్నట్లుగా సమాచారం. ఈ సోదాలు అర్ధరాత్రి వరకు కొనసాగ నుండగా, వివరాలు తెలిపేందుకు అధికారులు సుముఖత వ్యక్తం చేయలేదు. శుక్రవారం కూడా సోదాలు జరిగే అవకాశం ఉందని సమాచారం. సాధారణ తనిఖీల్లోనే భాగంగా ఈ సోదాలు చేపట్టినట్లు వినిపిస్తుండగా, గతంలో, ప్రస్తుతం జరిగిన అవినీతిని వెలికి తీసేందుకే సోదాలు జరిగినట్లుగా మరికొందరు అనుకుంటున్నారు.

# ట్రాఫిక్ రూల్స్ బ్రేక్ చేస్తే కఠిన చర్యలు....!

**- డీఎస్పీ రాజశేఖర్ రాజు హెచ్చరిక**

**హైవే పై ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు పరిశీలిన**

**మిర్యాలగూడ, మే 07,( ప్రజాజ్యోతి ):**

ట్రాఫిక్ రూల్స్ బ్రేక్ చేస్తే సహించేది లేదని, చర్యలు తప్పవని హెచ్చరించారు మిర్యాలగూడ డి.ఎస్.పి కె రాజశేఖర్ రాజు. మిర్యాలగూడ పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారులు, యూటర్న్ల వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ కోన్స్ మరియు డైవర్షన్ లను డీఎస్పీ రాజశేఖర్ రాజు గురువారం స్వయంగాపరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వాహన దారులు, వ్యాపారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు హెల్మెట్ ప్రాధాన్యతపై ఇప్పటి వరకు కేవలం కౌన్సిలింగ్ మాత్రమే ఇచ్చామని, అయితే ఇకపై నిబంధనలు కఠినతరం చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు. ఈ రోజు నుండి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోతే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. కొత్త హెల్మెట్ కొనుగోలు చేసి చూపించిన తర్వాతే వాహనాలను విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. ట్రాఫిక్ అంతరాయానికి కారణమవుతున్న ఆటోల పై డీఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు. ప్యాసింజర్లనుఎక్కించుకునేటప్పుడు ఆటోను పూర్తిగా రోడ్డు పక్కకు దింపాలని సూచించారు. ?పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని హెచ్చరించారు. ?రాంగ్ సైడ్ డ్రైవింగ్, రాంగ్ పార్కింగ్ చేస్తే కఠినమైన కేసులు నమోదు చేస్తామన్నారు. రహదారిపై డ్రైనేజీ కాలువల వెనుక భాగంలోనే వీధి వ్యాపారులు తమ షాపులనునిర్వహించుకోవాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించేందుకు ప్రజలకు 20 రోజుల సమయం ఇస్తున్నామన్నారు. ఆ తర్వాత ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే, మున్సిపల్ అధికారులతో కలిసి షాపులను సీజ్ చేయడమే కాకుండా, బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పట్టణం గుండా వెళ్లేది నేషనల్ హైవే కావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని, అందుకే కొత్తగా డివైడర్లు,యూటర్న్లను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియంత్రణకు సహకరించి, క్షేమంగా ఉండాలని కోరారు. ఆయన వెంట సిఐలు ఎం నాగభూషణరావు, జె. సోమనర్సయ్య, ట్రాఫిక్ ఎస్ఐ సిహెచ్ శ్రీనివాస్ సిబ్బంది ఉన్నారు.



# వైద్యం వికటించి మహిళ మృతి

**పెన్పహాడ్ మండలం మే 7 (ప్రజాజ్యోతి):**

వైద్యం వికటించి మహిళ మృతి చెందిన సంఘటన సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ మండల పరిధిలోని న్యూ బంజారాహిల్స్ తండాలో ఆర్ఎంపీ డాక్టర్ వైద్యం వికటించి మహిళ మృతి చెందినది. ఎస్సై కస్తాల గోపికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం న్యూ బంజారా హిల్స్ తండాకు చెందిన ధారావత్ కాశి భర్త సైదా వయస్సు 40 సంవత్సరాలు, ఈమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. అదే గ్రామానికి చెందిన ఆర్ఎంపి వైద్యుడు ధారావత్ నాగేందర్ మందులతోనే ఆరోగ్యం బాగుపడేలా చేస్తానని మందులు ఇవ్వడంతో ఆ మందులు వాడిన తరువాత మహిళ ఆరోగ్యం మరింత క్షీణించడంతో మెరుగైన వైద్యంకోసం ఖమ్మంలోని న్యూ ఆరోగ్య హాస్పిటల్ కు గత పదిరోజుల క్రితం చేర్పించగా చికిత్స పొందుతూ 06-05-2026 న బుధవారం మృతి చెందినట్లు తెలిపారు.



# డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు - - 50 మంది పట్టివేత..

**మద్యం సేవించిన వ్యక్తులకు పోలీస్ స్టేషన్లో అవగాహన కార్యక్రమం.. హెల్మెట్ తప్పనిసరి పాటించాలి..**

**వన్ టౌన్ సీఐ ఏమీ రెడ్డి రాజశేఖర్ రెడ్డి**

**నల్గొండ టౌన్ మే 7(ప్రజా జ్యోతి)**

నలగొండ వన్టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈరోజు డ్రంక్ అండ్ డ్రైవ్పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 50 మందిని పోలీసులు




అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వన్టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్లో డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వ్యక్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని, ప్రజలు తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టవద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు,మరియు హెల్మెంట్ తప్పనిసరిగా పాటించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీ. ఐ. హెచ్చరించారు. ప్రజలు బాధ్యతాయుతంగావ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లు, గోపాల్ రావు,సతీష్, సంజీవ రెడ్డి, గట్టుపల్, వెంకట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

